క్లుప్తంగా

నిబంధనలు పాటించకపోతే చర్యలు

● సీఐ చంద్రమౌళి



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ: వాహనదారులు నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని సీఐ ఎం. చంద్రమౌళి అన్నారు. పట్టణ ప్రధాన రహదారిపై బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్



ఎల్విన్‌పేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేటలో గల 76వ పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బి.శివశంకర సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీస్తూ, బీఎల్వోలకు పలు సూచనలు చేశారు.

ఉపాధి పనులపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరిరావు

వీరఘట్టం: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఉపాధి పనులపై ఏపీడీ శ్రీహరిరావు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి వేతనదారుడికీ 272 రూపాయల వేతనం వచ్చేలా పనులు కల్పించాలని సూచించారు. రానున్న వేసవిలో ప్రణాళికాబద్ధంగా పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. అలాగే కొత్త వేతనదారుల సంఖ్యను కూడా పెంచాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఏపీఓ జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య

జియ్యమ్మవలస: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి ముందుగానే చర్యలు చేపట్టాలని మండల సెక్టోరియల్ అధికారులకు తహసీల్దార్ కేవీ సీతారామయ్య సూచించారు. తన కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో గల అన్ని పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, దివ్యాంగులకు రైలింగ్ సదుపాయం, మరుగుదొడ్ల సదుపాయం ప్రతి పోలింగ్ కేంద్రాలలో ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.పకీర్, ఇరిగేషన్ ఏఈ జీవీ రఘు, ఎంఈఓ-2 శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటుకు చర్యలు



గదులను పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

పాలకొండ: ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరిచేందుకు అనువైన భవనాలను ఐటీడీఏ పీఓ, నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి బుధవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో ఉన్న గదులను పరిశీలించి, భద్రతపై ఆరా తీశారు. గత ఎన్నికల సమయంలో కూడా ఇదే కళాశాల భవనాల్లో ఈవీఎంలను భద్రపరిచారని అధికారులు ఆమెకు తెలిపారు. సదుపాయాలున్న గదులను కేటాయించాలని ప్రిన్సిపాల్ శంకరరావును ఆదేశించారు. ఆమెతో పాటు తహసీల్దార్ వరహాలు ఉన్నారు.

సాగునీటికి నిధులు కేటాయించాలి

● జీరో అవర్‌లో ప్రస్తావించిన ఎమ్మెల్యే కళావతి



జీరో అవర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం జీరో అవర్‌లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి నియోజకవర్గంలోని పలు సమస్యలను ప్రస్తావించారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేలా సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు రెండు వేల చెరువులున్నాయని, వాటిని మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఆధునీకరించి అభివృద్ధి చేయాలన్నారు. అలాగే కల్వర్టులు, ఓపెన్ హెడ్ చానల్స్ నిర్మించడానికి నిధులు కేటాయిస్తే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతమైన సీతంపేట మండలానికి ఉపాధి హామీ పథకంలో భాగంగా జీడి, మామిడి పంటలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గిరిజనులు పంటలు పండించుకునే ప్రాంతాల్లో వరదల నుంచి రక్షణగా గోడలు నిర్మించాలన్నారు. అలాగే భామిని మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని కోరారు. వంశధార కాలువ నిర్మాణం, తోటపల్లి కాలువ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, వీటితో పాటు పిల్ల కాలువలను ఆధునీకరించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ

గుమ్మలక్ష్మీపురం: వాహనదారులంతా రోడ్డు నియమాలు పాటించాలని పార్వతీపురం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వాహనదారులు, ఆటో, కార్, కమాండర్ల డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా సీటుబెల్ట్, హెల్మెట్ ధరించాలని, అతివేగంగా నడుపరాదని, ఎక్కడబడితే అక్కడే వాహనాల్ని నిలుపుదల చేయకూడదని, ఫోన్లో మాట్లాడుతూ వాహనం నడుపకూడదంటూ సూచనలు చేశారు. వారిచే ప్రతిజ్ఞ చేయించారు. పార్వతీపురం ఆర్టీఓ మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ వరహాలు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్‌తో పాటు పలువురు సర్పంచులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన సమగ్ర భూసర్వే పురోగతిని వివరించారు. ఈ క్రమంలో సంబంధిత భూ నూతన రికార్డుల జారీపై చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం అందించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ తాజా ప్రక్రియ, ఆన్‌లైన్‌కు సంబంధించి గ్రామాల్లో సాంకేతిక సమస్యలు, నూతనంగా ఇళ్ల స్థలాలు మంజూరుకూ అర్హుల వివరాలు అధికారి దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సర్పంచులు శివ్వాల శ్రీనివాసరావు, వాంద్రాసి జనార్దనరావు, కొండలరావు, వి.రాజారావు తదితరులున్నారు.

9న డీ వార్మింగ్ డే

గరుగుబిల్లి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఈ నెల 9న జరగనుందని, విజయవంతం చేయాలని రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.కార్తీక్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు నులిపురుగుల నివారణ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. నులి పురుగులు కారణంగా రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అల్బెండజోల్ మాత్రతో ఈ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. 1 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలోను, 6 నుంచి 19 ఏళ్ల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. భోజనం అనంతరం మాత్రలను మింగించాలన్నారు.

రూ. 54 లక్షలతో మంచినీటి ట్యాంక్

వీరఘట్టం: జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ. 54 లక్షలతో వీరఘట్టాం మేజర్‌పంచాయతీలోని బీసీ కాలనీ వద్ద కొత్త రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ రామచంద్రరావు మాట్లాడుతూ, ట్యాంక్‌తో పాటు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీరుస్తామన్నారు. ట్యాంక్‌కు వండవ కొండ పైనుంచి వస్తున్న ఉపరితల రక్షిత పథకం పైపులైన్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ట్యాంక్ పూర్తయితే బీసీ కాలనీ, గాయత్రీనగర్ కాలనీ, ఆర్అండ్‌బీ బంగ్లా, రెల్లివీధి, గొల్లవీధి, అగ్రహారం వీధి, గాసీ వీధులకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా అవుతుందని చెప్పారు.

ముగిసిన గ్రామదేవత సంబరాలు

భామిని: మండలంలోని నేరడి - బిలో గ్రామదేవత బంగారమ్మతల్లి సంబరాలు బుధవారంతో ముగిశాయి. మహిళలు ముర్రాటలతో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

తెలగా కులస్తులను బీసీల్లో చేర్పించాలి

పాలకొండ: తెలగా కులస్తులను బీసీల్లో చేర్చాలని తెలగ కుల సంక్షేమ సంఘ మండల అధ్యక్షుడు అప్పికొండ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలో పీవీఆర్ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా తెలగ సంక్షేమ సంఘ నాయకులు బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలగా కులస్తులను బీసీల్లో చేర్చాలన్న డిమాండ్‌తో పీవీఆర్ చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

మంచి ఫలితాలతో జిల్లాకు పేరు తేవాలి

● ఆర్డీఓ హేమలత

బలిజిపేట: రానున్న పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి జిల్లాకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆర్డీఓ హేమలత కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అరసాడ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడి కొన్ని సూచనలు అందించారు. పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్షల భయం పోగొట్టుకోవాలని హితవుపలికారు. పరీక్షలకు ఏవిధంగా ప్రిపరేషన్ చేసుకోవాలో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలతో చదువుకోవాలని చెప్పారు. పరీక్షలు పూర్తయ్యేవరకు చదువుపై దృష్టిసారించి మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం



బాధితుల ఆరోగ్య సమస్యలపై ఆరా తీస్తున్న వైద్యురాలు

పాలకొండ రూరల్: ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని వైద్యులు తేజారత్నం అన్నారు. కోటదుర్గమ్మ దేవస్థానం సమీపంలో గల పట్టణ సచివాలయ పరిధిలో రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మందికి వైద్య సేవలను అర్బన్ పీహెచ్‌సీ అధికారులు అందించారు. బాధితుల సమస్యల మేరకు అవసరమైన వైద్య పరీక్షలు చేయటంతో పాటు ఉచితంగా మందులు అందించారు. కంటి సమస్యలు ఉన్న వారికి అద్దాలు సమకూర్చారు. ఈ శిబిరానికి హెచ్‌వీ రవణమ్మ, ఆశా కార్యకర్తలు పేకేటి శ్రీదేవి, జి.లక్ష్మి, రాధారాణి, కె.గౌరీశ్వరి తదితరులు సహకరించారు.

మౌలిక వసతులు తప్పనిసరి

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

వీరఘట్టం: ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక వసతులుండేలా చర్యలు తీసుకోవాలనిన ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఆదేశించారు. మండల కేంద్రంలోని సీబీఎం స్కూల్‌లోని 257వ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రం భవనం పైకప్పును బాగు చేయాలని సూచించారు. పరిశీలనలో తహసీల్దార్ కె.జయప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ, ఎంఈఓ ఆర్.ఆనందరావు, తదితరులున్నారు.

పిల్లలందరికీ మందులు అందించాలి..



సిబ్బందికి మందులు అందజేస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారులు

పాలకొండ రూరల్: పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు నులి పురుగులను నివారించేందుకు ఈనెల 9న జరపనున్న డీ వార్మింగ్ డే సందర్భంగా మందులు పంపిణీ చేయాలని ఎంపీడీఓ పైడితల్లి అన్నారు. ఈ మేరకు ఎం. సింగుపురం పీహెచ్‌సీ సిబ్బందితో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీ వార్మింగ్ డే పక్కాగా నిర్వహించాలన్నారు. వైద్యాధికారులు వి.కమల్‌నాథ్, ఎస్.రవికుమార్ మాట్లాడుతూ, తమ పరిధిలో దాదాపు 5,889 మంది చిన్నారులకు నులి పురుగు నివారణ మందులు అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఆల్బెండజోల్ మాత్రలను క్షేత్రస్థాయి సిబ్బందికి అందజేసినట్లు తెలిపారు.

బాసూరు క్రీడాకారిణుల ప్రతిభ



గెలుపొందిన క్రీడాకారిణులతో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

పాకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో మండలంలోని బాసూరుకు చెందిన క్రీడాకారిణులు ప్రతిభ కనబరిచారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులతో పాటు గ్రామానికి చెందిన ఔత్సాహిక క్రీడాకారిణులు కబడ్డీలో జిల్లా స్థాయిలో మెరిశారు. ఈ మేరకు క్రీడాకారిణులను బుధవారం అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిర్లపు మల్లేశ్వరమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎస్. గురునాయుడు, అల్లెన పకీరునాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలపై ఒత్తిడి తీసుకురాకుండా పన్ను వసూలు చేయాలని సూచించారు. మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఖాళీ స్థలాలకు సైతం పన్ను వేయాలన్నారు. ఆయనతో పాటు మేనేజర్ జి. జయరామ్, ఆర్ఐ కె. గజపతిరావు ఉన్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవం రేపు



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

కురుపాం: నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ సూచించారు. కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిన్నారులు, విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ పూర్తి చేశామన్నారు. 1 నుంచి 5సంవత్సరాల చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలోను, 6 నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలలో పంపిణీ జరుగుతుందని ఆయన వివరించారు. భోజనం అనంతరం మాత్రలు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌పీలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసతులను పరిశీలించిన ఆర్డీఓ



పోస్టుమెట్రిక్ వసతిగృహ పరిసరాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ

కురుపాం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులను పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పోస్టుమెట్రిక్ వసతిగృహంలో భవనాలను, సౌకర్యాలను బుధవారం పరిశీలించారు. ఎన్నికల మెటీరియల్ భద్రత, ఈవీఎం స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు అవసరమైన అదనపు భద్రత సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్ ఎ.వేణుగోపాల్‌కు సూచించారు. ఆయన వెంట కురుపాం ఆర్ఐ కరుణాకర్, వీఆర్ఓ మహేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



ప్రధాన రహదారి మధ్యలో జారిపడిన 11 కేవీ విద్యుత్ వైరు

గుమ్మలక్ష్మీపురం/కురుపాం: గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వైపు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు (గుమ్మ- గదబవలస గ్రామాల) మధ్యలో బుధవారం మధ్యాహ్నం 11 కేవీ విద్యుత్ వైరు జారి పడింది. అయితే రోడ్డుకు పక్కనే ఉన్న చెట్టు కొమ్మలు విద్యుత్ వైరుకు తగలటం వలన షార్ట్‌షర్క్యూట్ అయ్యింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ మార్గంలో పత్తి బస్తాల భారీ లోడుతో వెళ్లున్న లారీ వల్ల విద్యుత్ వైరు తెగిపడిందని స్థానికులు తెలిపారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పీఏసీఎస్ అధ్యక్షురాలిగా లీల నియామకం



పీఏసీఎస్ అధ్యక్షురాలిగా నియమితులైన లీల

కురుపాం: కురుపాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షురాలిగా కురుపాం పంచాయతీ పరిధిలోని పూతికవలస గ్రామానికి చెందిన శంబంగి లీలను నియమిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఉన్న కొదంగోళ్ల గౌరీశంకరరావు (మజ్జి)ను తప్పించి ఈయన స్థానంలో నూతనంగా అధ్యక్షురాలిగా పదవిని శంబంగి లీలను, సభ్యులుగా గవర విజయ్ చంద్రశేఖర్, అద్దేపల్లి భాస్కరరావును నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శంబంగి లీల మాట్లాడుతూ పీఏసీఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

త్వరగా జల్‌జీవన్ మిషన్ పనులు



జల్‌జీవన్ మిషన్ పనులపై సమీక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో మిగిలి ఉన్న జల్‌జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండల స్థాయి జల్‌జీవన్ మిషన్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ జల సంఘం కమిటీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జలజీవన్ మిషన్ పథకం ద్వారా మొత్తం 137 పనులు మిగిలి ఉన్నాయని, ఈ పనులు పూర్తి చేసేందుకు కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టంను నియమించుకొని, సకాలంలో ఆయా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ జి.జగదీష్‌కుమార్, వైకేపీ ఏపీఎం ఆదయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పథకాలు ప్రజలందరికీ వివరించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి అప్పలనాయుడు

భామిని:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను పల్లెకు పోదాం కార్యక్రమంలో ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా కార్యదర్శులు గంటా అప్పలనాయుడు, కొత్తకోట తిరుపతిరావు అన్నారు. మండలంలోని బాలేరులో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మండల రాంబాబు, టంకాల వాసుదేవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెకుపోదాం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ కలిశెట్టి శంకర్, నియోజకవర్గ కన్వీనర్ సవర జమ్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి



మొండెంఖల్ గ్రామంలో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ

కురుపాం: రహదారి భద్రత నిబంధనలు ప్రతీ ఒక వాహన చోదకుడు పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కోరారు. మొండెంఖల్ గ్రామంలో వాహన చోదకులు, ఆటోడ్రైవర్లతో రహదారి భద్రత నిబంధనలపై బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించటం, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మొండెంఖల్ గ్రామ సర్పంచ్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, లుంబేసు సర్పంచ్ కళావతి, ఐ.రామకృష్ణ, ఆటోవాలాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్ పరిశీలన



ఇసుక ర్యాంప్ పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

భామిని: మండలంలోని నేరడి బిలో గల వంశదార నదీతీరంలోని ఇసుక ర్యాంప్‌ను శ్రీకాకుళం భూగర్భ గనుల శాఖాధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ర్యాంప్ జీపీఎస్‌ను పరిశీలించడంతో పాటు ఇసుక నాణ్యత, లభ్యత, రవాణా మార్గాలపై ఆరా తీశారు. మూడేళ్ల కిందట ప్రభుత్వం ఇసుక ర్యాంప్ నిర్వహించి కొంతకాలం తర్వాత నిలిపివేసింది. పరిశీలనలో మండల అధికారులు ఎస్. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.